# నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎమ్సి) :

## వైద్య విద్యను, ప్రభుత్వ వైద్యాన్ని మరింత దిగజార్చి, కార్పొరేట్ల లాభాలకోసమే

**ఇప్పటివరకు** దేశంలో సాగుతున్న వైద్య విద్యను, వైద్య వృత్తికి సంబంధించిన నైతిక నియమావళిని, వైద్యుల గుర్తింపును, రిజిస్టర్లను నడుపుతూ వచ్చిన మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ)ను రద్దుపరుస్తూ – దాని స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఏర్పరుస్తూ ఎన్ఎమ్సి బిల్లు – 2017ను పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాయి. 8–8–19నాడు రాష్ట్రపతి ఆమోద ముద్రపడి అది చట్టరూపం ధరించింది. దీనికి వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌తోపాటు వైద్య విద్యార్థులు దేశవ్యాపితంగా పెద్దఎత్తున గత 2 సంవత్సరాలుగా ఆందోళన చేస్తూ వచ్చారు. వారందరి ఆందోళనలను నిరసనలనూ పెడచెవిన పెట్టారు. 2017 డిశంబరులోనే ఈ బిల్లు పార్లమెంటు ముందుకు రాగా దాదాపు వైద్య వృత్తిలో వున్న వారంతా దానికి నిరసన తెలిపారు; పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దాంతో బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపారు. ఆ స్టాండింగ్ కమిటీకి పలు సంస్థలు వినతిపత్రాలు అందజేసి తమ వాదనలు వినమని అభ్యర్థించాయి. అయితే స్టాండింగ్ కమిటీ ఆయా సంస్థల అభ్యంతరాలు వినడానికి నిరాకరించింది. మౌలిక స్వభావం కలిగినవి కానప్పటికీ స్టాండింగ్ కమిటీ బిల్లులో కొన్ని మార్పులు, చేర్పులను ప్రతిపా దించింది. అయితే ఈ ప్రతిపాదనలను కూడ పరిగణలోకి తీసుకోకుండా కేంద్రంలోని బిజెపి పాలకులు కార్పొరేట్లకు సేవజేసే తమ రాజకీయ లక్ష్యాలకనుగుణంగా ఎన్ఎమ్సి చట్టం చేశారు.

**ఇంట్లో ఎలుకలు పడ్డాయని ఇల్లు తగలబెట్టుకున్న చందాన...**

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఎందుకు రద్దుచేయాల్సి వచ్చిందన్న ప్రశ్నకు పాలకులు చెప్పిన జవాబు దాని ప్రతిష్ట మసక బారిందనీ, అవినీతిలో కూరుకుపోయిందనీ! లాభార్జనాదృష్టితో ప్రైవేటు వైద్య విద్యా సంస్థలను పెంచుతూ రావటం, సూపర్ లాభార్జనల కార్పొరేటు వైద్యాన్ని ప్రోత్సహించటమనే పాలకుల విధానాలే దీనికి కారణం. ఈ విధానాలలో మార్పులేకుండా మరింత పకడ్బందీగా, మరింత స్వేచ్ఛగా ప్రైవేటు వైద్య విద్యను, కార్పొరేటు వైద్యాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లచేసేందుకు వీలు కల్పించే విధంగా ఈ కొత్త చట్టాన్ని రూపొందించారు.

ఇంట్లో ఎలుకలు పడితే ఎలుకల్ని బయటికి తరిమేసి ఇల్లు చక్కబెట్టుకుంటామా? లేక ఇంటినే తగలేసుకుంటామా? ఇపుడు కేంద్రప్రభుత్వం చేసింది ఎలుకల సాకుతో వున్న ఇంటిని తగులబెట్టి మరిన్ని ఎలుకలు దూరేలా మరో కొత్త చట్రాన్ని రూపొందించటమే.

**ప్రైవేటుకు నిబంధనలు మరింత సరళతరం**

ఇప్పటివరకు అమలులో వున్న చట్టం ప్రకారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్ని క్రమం తప్పక తనిఖీ చేయాలి. ప్రత్యక్షంగా పరిశీలించాలి. ఆయా కళాశాలల్లో తగినన్ని పడకలూ, తగినంత మంది రోగులూ, సిబ్బందీ, వున్నారా, లేరా అని పరిశీలించాలి. అలా లేకుంటే వున్న (మంజూరైన) వైద్యసీట్లను (యుజి,పిజి)కూడ తగ్గించాలి. నిబంధనలు ఏదోమేరకు కఠినతరంగా వుండేవి. ఆ నిబంధనలను పాటించడంకన్నా కళాశాల తనిఖీ బృందానికి కోట్ల రూ॥లంచం ఇవ్వడమే ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలకు సులువుగా వుండేది. ఈవిధంగా సాపేక్షంగా కఠినతరమైన నిబంధనలు ఉన్ననాడే ఎమ్సిఐ అవినీతి, ఆరోపణలలో కూరుకుపోయింది. కాగా, ఎమ్సిఐలోని నిబంధనలన్నిటినీ సరళతరం చేసి, బిజెపి పాలకులు ఎన్ఎమ్సిని రూపొందించారు.

దీని ప్రకారం, ప్రైవేటు వైద్య కళాశాలలు తమ ఇష్టం వచ్చినన్ని సీట్లు కోరుకోవచ్చు. ఒకవేళ తనిఖీ చేసినపుడు సరైన వసతులు లేకపోతే కొత్తగా ఏర్పడే కమిషన్ సీట్లను కత్తిరించదు. పెనాల్టీ వేస్తుందంతే.

అంతేకాదు, గతంలో మేజేజిమెంటు కోటాకింద 15శాతం సీట్లను మాత్రమే కోటీశ్వరులకు అమ్ముకోగలిగేవి. ఇపుడు 50 నుండి 60 శాతం వరకు సీట్లను అమ్ముకునే అవకాశం కొత్త చట్టంలో ఇచ్చారు.

**'స్వతంత్ర ప్రతిపత్తి'కి సంపూర్ణ సమాధి**

జాతీయోద్యమ కాలంలోనే విద్యావ్యవస్థలపై వలసపాలకుల పెత్తనమేమిటని ప్రజాతంత్ర వాదులు, దేశభక్తులనేకమంది ప్రశ్నించారు. స్వతంత్ర వ్యవస్థల కోసం డిమాండ్ చేశారు. ఫలితంగా 1934లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను చట్టబద్ధమైన స్వతంత్ర(అటానమస్) సంస్థగా నెలకొల్పారు. 1947లో అధికారమార్పిడి జరిగాక 1956లో మళ్ళీ కొత్తచట్టం తెచ్చారు.

ఈ కౌన్సిల్‌లో ఇప్పటివరకు 160 మందివరకు సభ్యులుగా వుంటే అందులో 2/3వ వంతు మంది ఎన్నికయ్యేవారు. నామినేట్ చేయబడే వారి సంఖ్య తక్కువగా వుండేది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలనుండి, విశ్వవిద్యాలయాలనుండి ప్రాతినిధ్యం వుండేది. వైద్య వృత్తిలోని వారికే అవకాశం వుండేది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు కౌన్సిల్ సభ్యులనుండే ఎన్నికయ్యేవారు.

ప్రస్తుత ఎన్.ఎమ్.సి. చట్టం ఈ స్వరూపాన్ని మార్చివేసింది. ఏదోమేరకున్న దాని స్వతంత్ర స్వభావాన్ని రద్దుచేసింది. కేంద్రప్రభుత్వం తన కిష్టం వచ్చిన వారిని ఈ కమీషన్‌లో నామినేట్ చేసుకునే అవకాశం కల్పించుకుంది. వైద్యవృత్తికి సంబంధించిన వారే ఇందులో వుండాలన్న నిబంధనను ఎత్తివేసింది. ఎన్నికయ్యే సభ్యుల సంఖ్యను తొమ్మిదికి కుదించింది. వైద్యరంగం- కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోని అంశం. గతంలో ఎంసిఐలో రాష్ట్రాల నుండి తగినంత మంది ప్రతినిధులు - ముఖ్యంగా వైద్యరంగం నుండి వుండేవారు. ప్రస్తుత ఎన్ఎమ్‌సి చట్ట ప్రకారం రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోవటంతో పాటు, వైద్యేతర (రాజకీయ) రంగాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఎన్ఎమ్‌సిపై గుత్తాధిపత్యం నెలకొల్పుకుంది.

ఎన్ఎమ్‌సి పర్యవేక్షణ కింద 4 స్వతంత్ర బోర్డులను ఏర్పాటు చేస్తారు. 1) అండర్ గ్రాడ్యుయేట్(ఎంబిబిఎస్) మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు 2) పోస్టు గ్రాడ్యుయేట్ బోర్డు 3) మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు 4) ఎథిక్స్ (నైతిక విలువలు) అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు. ఎన్ఎమ్‌సికే స్వతంత్రత లేకుండాచేసి, దాని ఆధ్వర్యంలో నియామకమయ్యే ఈ బోర్డులు స్వతంత్రంగా పనిచేస్తాయని చెప్పడం హాస్యాస్పదం కాదా!? పైగా వీటిలో వైద్య కళాశాలల అసెస్‌మెంట్, రేటింగ్ ఇచ్చే బోర్డు స్వయంగా తనిఖీలు చేపట్టకుండా కన్సల్టెన్సీల ద్వారా చేయించుకునే అవకాశం కల్పించారు. వారిని కొనుగోలు చేస్తే, మంచిరేటింగ్ సాధించుకుని ప్రైవేటు వైద్య కళాశాలలు తమ సీట్లకు గిరాకీ మరింతగా పెంచుకోడానికి ఎంతో చక్కటి అవకాశాలు కల్పించారు. ప్రస్తుతం స్వతంత్ర ప్రతిపత్తి పేరుతో వున్న యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి)కి కూడ ఇదే పరిస్థితి దాపురించనుంది.

**విద్యార్థులకేమో నిబంధనలు కఠినతరం**

మెడికల్ కళాశాలలో సీటు సాధించాలంటే ఇంటర్మీడియట్ చదివి నేరుగా పరీక్ష రాస్తే చాలదు. ఖచ్చితంగా కోచింగ్‌సెంటరులో చేరి వాళ్ళకు లక్షల రూ॥లు చెల్లించి శిక్షణ తీసుకోవాల్సిన తప్పని స్థితి కల్పించారు. పి.జి. సీటు సాధించడం మరో యజ్ఞం. ఇపుడు ఈ చట్టంలో మరో మెలిక పెట్టారు. ఎం.బి.బి.యస్ పరీక్షలో పాసై వైద్య వృత్తిలోకి ప్రవేశించాలంటే నేషనల్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్ అనే అర్హత పరీక్ష ఉత్తీర్ణులవ్వాలనే మరో నిబంధన పెట్టారు.

ఇప్పటి వరకు ఈ పరీక్షను ఇతర దేశాల్లో చదివి వస్తున్న విద్యార్థులకు మాత్రమే పెట్టేవారు. విదేశాల్లో వైద్యవిద్యలో ఉత్తీర్ణులైనవారు సరైన ప్రమాణాల్లో చదివారో లేదో పరిశీలించటానికి దీన్ని పెడుతున్నారంటే అర్థముంది. మన విశ్వ విద్యాలయాలు డిగ్రీ ఇచ్చాక, తిరిగి ఆ విద్యార్థులకే మరో పరీక్ష పెట్టడం ఎందుకన్న వైద్య వర్గాల ప్రశ్నకు ప్రభుత్వం నుండి సమాధానం లేదు.

**దేశీయ వైద్య విధానాలకు ప్రోత్సాహం శూన్యం**

ఆధునిక వైద్యంగా చెప్పుకోబడే(అల్లోపతి) వైద్యం విదేశాలనుండి తీసుకున్నది. మనదేశంలో సాంప్రదాయకంగా నడుస్తున్న వైద్యవిధానా లున్నాయి. ఆయుర్వేదం, యునాని, సిద్ధ, ప్రకృతి వైద్యవిధానాలు. విదేశాలనుండి వచ్చినప్పటికీ హోమియో వైద్యాన్ని కూడ ఈ జాబితాలోకే చేర్చి వీటన్నిటికి కలిపి ఆయుష్ అనే వైద్యశాఖను ఏర్పరచారు.

ఈ వైద్య విధానాల్లో కొన్ని సుగుణాలు వున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ ఎన్నో జబ్బులకు ఆకులు వనమూలికల ద్వారా వైద్యం చేసే పద్ధతి వుంది. ఔషధగుణాలున్న ఎన్నో మొక్కలు మన నేలల్లో పెరుగుతున్నాయి. ఎన్నో రకాల వనమూలికలున్నాయి. ఔషధ గుణంగల ఖనిజాలున్నాయి. వీటన్నిటిపై తగినంత పరిశోధనలు జరగాలంటే ప్రభుత్వం తన బడ్జెట్‌నుండి కేటాయింపులు జరపాలి. ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఈ విధానాలతో జోడించాలి. చైనాలాంటి దేశాలు తను సాంప్రదాయక ఆక్యుపంచర్ విధానాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసిన సంగతి మనకు తెలుసు.

కాగా, మన దేశ పాలకులు దేశీయ వైద్య పరిశోధనలపై ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. ఇపుడు ఈ చట్టం ద్వారా దీనికున్న కనీసపాటి అవకాశాలను కూడా తుడిచి పెడుతున్నారు. ఆయుర్వేద, హోమియో తదితర వైద్య కోర్సులు చదివిన వారికి 6 నెలల బ్రిడ్జి కోర్సులుపెట్టి అల్లోపతి/మోడరన్ వైద్యం చేసే అవకాశాన్ని ఈ బిల్లు కల్పిస్తుంది. ఈ నిబంధన ద్వారా దేశీయ వైద్యాన్ని అభివృద్ధిచేసే బాధ్యత నుండి పాలకులు తప్పుకోదలచుకున్నారనేది స్పష్టం.

**గ్రామీణ వైద్యం మరింత సంక్లిష్టం**

దేశంలోని వైద్యులు పట్టణ ప్రాంతాలకే పరిమితమయ్యారని, గ్రామీణ ప్రాంతంలో తప్పనిసరిగా పనిచేయాలన్న నిబంధనను వైద్య విద్యార్థుల ముందు చాలకాలంగా పాలకులు పెడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరీ అధ్వాన్నం. (గ్రామీణ, పట్టణ వైద్యుల నిష్పత్తి 1:4). తగిన ఆసుపత్రి, నివాసం కల్పించి తగు వేతనం ఇస్తామంటే వెళ్ళడానికి వైద్యులు సిద్ధ పడతారు. వాటిని కల్పించకుండానే పాలకులు దశాబ్దాలు గడుపుతున్నారు.

దాంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పి.ఎం.పి, ఆర్.ఎం.పిలే దిక్కవుతున్నారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కార్పొరేట్ ఆసుపత్రులు వీరిని దళారులుగా పెట్టుకుని తమకు రోగుల్ని పంపినందుకు కమిషన్లు, పర్సెంటేజిలు చెల్లిస్తున్నాయి. ప్రస్తుత బిల్లు ఈ వైద్యులకు కూడ గుర్తింపు నిస్తామంటున్నది తప్ప, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేవైపు ఈ బిల్లు తీసుకున్న చర్యలు శూన్యం.

ఏతావాతా, ఈ కొత్తబిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం మొత్తం వైద్యవిద్యను, వైద్యవృత్తిని తన చేతిలోకి తీసుకుంది. ప్రైవేటు కార్పొరేటుకు, వైద్య విద్యా వ్యాపారాన్ని సరళతరం చేసింది. పేద వర్గాల విద్యార్థుల విద్యావకాశాలను మరింతగా కుదించి ధనాఢ్యవర్గాలకే వైద్య విద్యను పరిమితం చేస్తోంది.

**వైద్యం, వైద్యవిద్యలను ప్రభుత్వమే నిర్వహించాలి**

మన వైద్య వ్యవస్థలో ప్రైవేటు పద్ధతిని రద్దుచేసి పూర్తిగా ప్రభుత్వమే చేతుల్లోకి తీసుకొని వైద్యం పొందే హక్కును ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించాలని కమ్యూనిస్టులు, ప్రజాతంత్రవాదులు ఎంతోకాలంగా డిమాండు చేస్తూవస్తున్నారు. బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక వంటి చిన్నదేశాలు కూడ వైద్యాన్ని ప్రభుత్వ రంగంలోనే అందిస్తున్నాయి.

వైద్యవిద్య గతంలో ప్రభుత్వరంగంలోనే చాలా దశాబ్దాలు నడిచింది. ప్రైవేటురంగంలో అనుమతులు పెంచాక వైద్య విద్య వ్యాపారీకరణ పెరిగింది. ప్రైవేటు వైద్య కళాశాలలు పెరగకుండా మెడికల్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు కొంతలో కొంత నియంత్రణ వుండేది. ఇపుడు ఎన్ఎమ్‌సి చట్టంతో సరళతరమైన నిబంధనలవల్ల కార్పొరేటుశక్తులు, బహుళజాతి సంస్థలతో సహా ఈ రంగంలోకి ప్రవేశించి విస్తరిస్తాయి; పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య ఇక అందే అవకాశం వుండదు.

కమ్యూనిస్టు విప్లవకారులు, ప్రజాతంత్ర శక్తులు వైద్యరంగంలో పాలకులు తీసుకుంటున్న చర్యలను ప్రజలమధ్య బహిర్గతం చేయాలి. వైద్యం ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించాలనీ –ప్రభుత్వరంగంలోనే వైద్యవ్యవస్థ, వైద్య విద్య వుండాలన్న డిమాండు కోసం విస్తృతమైన ప్రజాఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలి.

oooo